సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 24 । నవంబర్ । 2024



అక్రమాలు అరికట్టాల్సిందే

ఇసుక అక్రమాలు అరికట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. జెడ్పీ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. - 8లో



పేదల ఇళ్లు బుగ్గిపాలు

సంతవురిటిలో అగ్ని ప్రమాదం జరిగింది. తొమ్మిది ఇళ్లు కాలిపోయాయి. - 8లో

28న 'మనో' సంగీత విభావరి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని ఏడు రోడ్ల కూడలిలో ఎన్‌టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఈ నెల 28న ప్రముఖ సినీ గాయకుడు మనో(నాగూర్‌బాబు) సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సుమిత్రా కళాసమితి అధ్యక్ష కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలిసి ఆహ్వానం అందజేశారు.

న్యూస్‌రీల్

శ్రీకాకుళం ఐఎంఏకు రెండు అవార్డులు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నర్సింహమూర్తి

శ్రీకాకుళం: శ్రీకాకుళం ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు రెండు అవార్డులు లభించాయి. గుంటూరులో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఐఎంఏ సమావేశం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఐఎంఏ అధ్యక్షుడిగా వ్యవహరించిన డాక్టర్ సనపల నర్సింహమూర్తికి, ఉత్తమ అధ్యక్షుడిగా అవార్డు లభించింది. అలాగే శ్రీకాకుళం మహిళా వైద్యుల విభాగానికి మిషన్ పింగ్ యాక్టివిటీ(ఎనిమియా, మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలకు సంబంధించి) అవార్డులు దక్కాయి. ఈ అవార్డులను డాక్టర్ సనపల నర్సింహమూర్తి, డాక్టర్ గంగాధర్‌లు అందుకున్నారు.

అపార్‌పై అధికారులు స్పందించాలి



గొండు సీతారాం

శ్రీకాకుళం: అపార్ నమోదు కష్టాలపై వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం, ఆలస్యం తదితర కారణాలతో జిల్లాలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సూచించారు. గ్రామ, నగర పంచాయతీ, మున్సిపల్, నగరపాలక సంస్థల్లో ఆధార్ దోషాలు సరిచేసేందుకు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. దీనిపై కమిషన్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి, డీవీఈఓ, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులకు కమిషన్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని ప్రకటనలో పేర్కొన్నారు.

SUNDAY SPECIAL

అతివదే ఆతిథ్యం

కంచంలో అన్నం వడ్డిస్తుంటే గాజుల చప్పుడు వినడం ఇళ్లలో అందరికీ అలవాటే. ఇప్పుడు ఇంటిలోనే కాదు హోటళ్లలోనూ ఆ చప్పుడు వినిపిస్తుంది. ప్యాంట్లు, చొక్కాలకు అలవాటు పడిపోయిన ఈ ఆతిథ్య రంగానికి చీరలు, చుడీదార్లు ఇప్పుడు కొత్త ఊపిరి పోస్తున్నాయి. దశాబ్దాల పాటు రెస్టారెంట్లు, హోటళ్లలో వడ్డించిన పురుష పుంగవుల స్థానాన్ని అతివలు అతి లాఘవంగా భర్తీ చేయగలుగుతున్నారు. తమకు వండడమే కాదు వడ్డించడం కూడా తెలుసని అంటున్నారు.





శ్రీకాకుళంలోని ఓ రెస్టారెంట్‌లో ఆహారాన్ని వడ్డిస్తున్న మహిళా సిబ్బంది

- హోటళ్లలో వడ్డింపు బాధ్యతలు మావే అంటున్న మహిళలు
- రెస్టారెంట్‌లలో పురుషులతో సమానంగా పనిచేస్తున్న వైనం
- మహిళలకే ప్రాధాన్యత ఇస్తున్న యాజమాన్యాలు
- ఉన్న ఊరిలో పెరుగుతున్న ఉపాధి అవకాశాలు

టెక్కలి/శ్రీకాకుళం/పీఎన్ కాలనీ/వజ్రపుకొత్తూరు:

రెస్టారెంట్లలో భోజనం అంటే.. వంట నుంచి వడ్డన వరకు అన్నింటా మగవారే కనిపించేవారు. దశాబ్దాలుగా ఇదే పద్ధతి ఉండేది. కానీ ఇప్పుడు వడ్డనలోకి మహిళలు కూడా చేరుతున్నారు. సర్వర్ అదే పదాన్ని మర్చిపోయి వెయిట్రస్ అనే పదాన్ని అలవాటు చేసుకునేంతలా అధిక సంఖ్యలో ఆతిథ్య రంగంలోకి దూసుకువస్తున్నారు. రెస్టారెంట్‌లకు వచ్చే వారికి సంప్రదాయబద్ధంగా గౌరవం ఇచ్చే విషయంలో మహిళలు బాధ్యతతో పాటు ఆహారం సరఫరా చేసే విషయంలో ఎంతో ఓపికగా ఉంటారనే భావనతో రెస్టారెంట్‌ల యజమాన్యాలు మహిళల్ని వెయిటర్స్‌గా నియమిస్తున్నాయి. ఇప్పుడు ఆతిథ్య రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండడంతో ఆ రంగంలో మహిళలు అడుగులు వేస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు పెద్ద, చిన్న పట్టణాల్లో ఉన్నటువంటి రెస్టారెంట్‌లలో ఇప్పుడిప్పుడే యువతులకు అవకాశాలు లభిస్తున్నాయి.



టెక్కలిలోని ఓ రెస్టారెంట్‌లో వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్న మహిళలు

భద్రత ఉంటుందనే..



హోటల్ రంగంలో పనిచేస్తే భద్రత ఉంటుందని ఈ రంగాన్ని ఎంపిక చేసుకుని అందులో చేరాను. హోటల్ యజమానులే భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు. వేరే ఇతర షాపుల్లో పనిచేస్తే వ్యక్తిగతంగా వసతి, భోజన వంటి సౌకర్యాలను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. భద్రత తక్కువగా ఉంటుంది.

– దీపిక, నార్తరన్ సర్కార్స్, శ్రీకాకుళం

ఎంతో ఇష్టంగా ఈ వృత్తిని ఎంచుకున్నాను



మాది కోల్‌కతా. హోటల్ మేనేజ్‌మెంట్ చేశాను. ఈ వృత్తి నాకు ఎంతో ఇష్టం. రెస్టారెంట్‌కు వచ్చే వారికి ఎంతో గౌరవంతో భోజనాలు అందివ్వడంలో సంతృప్తి ఉంటుంది. నాతో పాటు మరి కొంత మంది ఇక్కడే పనిచేస్తున్నారు.

– మనోరమ, ఫ్లోర్ మేనేజర్, రెసిపీస్ రెస్టారెంట్, టెక్కలి

పురుషులతో సమానంగా పని



మహిళలు కూడా మగవారితో సమానంగా పనిచేస్తున్నారు. వడ్డించేందుకు మగవారి కంటే ధీటుగా, బాధ్యతగా వ్యవహరిస్తున్నారు. అందుకే ఉపాధి కల్పిస్తున్నాం.

– జామి రాజశేఖర్, జీఎంఆర్ రెస్టారెంట్ యజమాని, శ్రీకాకుళం

ఈ రంగంలో నిలదొక్కుకున్నాను..



హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో నేను నిలదొక్కుకున్నాను. సన్ రెస్టారెంట్‌లో గత ఆరేళ్లుగా పని చేస్తున్నాను. రాగోలు, శ్రీకాకుళం, పూండి బ్రాంచ్‌ల లో పని చేశాను.

– నిర్మల, సర్వర్, సన్ మల్టీక్యూజిన్ రెస్టారెంట్, పూండి



జిల్లాలో ఇలా..

జిల్లాలో పలు ప్రాంతాల్లో సుమారు 200 వరకు పెద్ద, చిన్న రెస్టారెంట్లు ఉన్నాయి. అందులో వివిధ విభాగాల్లో మహిళలు పనిచేస్తున్నారు. కేటగిరీ వారిగా పరిశీలిస్తే...

స్టీవార్డ్స్	కెప్టెన్స్	పురుషులు	మహిళలు	అర్హత కలిగిన వారు
1200	300	800	700	500



వెంకన్నకు విశేష అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని చిన్నబజారులో దూదివారి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలు అనంతరం స్వామివారికి పూలు, తులసిమాలలతో అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జెమ్స్‌లో వైట్‌కోట్ సెర్మనీ



శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో వైట్‌కోట్ సెర్మనీ శనివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా కాలేజ్ చీఫ్ మెంటర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విద్యార్థులను ఉన్నతమైన వైద్యులుగా తీర్చిదిద్దడమే జెమ్స్ లక్ష్యమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత మాట్లాడుతూ ఎంబీబీఎస్ సీటు వచ్చినపుడు జెమ్స్ కళాశాలను ఏరికోరి ఎంచుకోవడం తమకెంతో గర్వకారణమన్నారు. తమ వద్ద పనిచేస్తున్న అధ్యాపకులు ఎంతో నిష్ణాతులని అన్నారు. ప్రస్తుతం జెమ్స్‌లో ఆధునిక కేన్సర్ వైద్య విధానంతో పాటు అవయవదానం ఇతరత్రా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసులు చీఫ్ అడ్మిన్ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీ చేద్దాం



శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు భవనం నుంచి ఆయన శనివారం ఆన్‌లైన్‌లో జిల్లాలో గల న్యాయమూర్తులతో లోక్‌అదాలత్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 14న నిర్వహించనున్న లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని, అన్ని కోర్టుల్లోనూ అదాలత్ నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి న్యాయ సేవాధికార సంస్థ ఆర్.సన్యాసినాయుడు,న్యాయవాదులు పాల్గొన్నారు.

అరసవల్లిలో ప్లాస్టిక్ నిషేధం



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అరవసల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పరిధిలో ప్లాస్టిక్ నిషేధించాలని కమిషనర్ పీవీవీడీ ప్రసాద్ అన్నారు. అరసవల్లి దేవాలయ పరిధిలోగల వ్యాపారులు, సిబ్బందితో ప్లాస్టిక్ నిషేధంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో ఉన్న ఏ ఒక్కరూ ప్లాస్టిక్ వాడొద్దని అన్నారు. ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఓ మై డాగ్

ప్రాణాలను పణంగా పెట్టి... మత్తును పసిగట్టి... అక్రమార్కుల భరతంపట్టి...

- నార్కోటిక్ డాగ్ సాయంతో మాదక ద్రవ్యాల జాడ తెలుసుకుంటున్న ఖాకీలు
- శిక్షణ నుంచి ఆహారం వరకు అన్నీ ప్రత్యేకమే

ఆమదాలవలస రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలన్నీ యమబిజీగా ఉన్నాయి. లగేజీలతో వచ్చిన ప్రయాణికులు ఎవరి ట్రైన్ల కోసం వారు నిరీక్షిస్తున్నారు. స్టేషన్ అంతా ఎప్పటిలాగానే హడావుడిగా ఉంది. అంతలో అక్కడకు వచ్చిన ఖాకీలు వెతుకులాట మొదలుపెట్టారు. ఎవరికీ ఏమీ కనిపించలేదు. కానీ అప్పుడే 'రాణి' రంగంలోకి దిగింది. స్టేషన్‌లోకి అడుగుపెట్టడమే లేటు..చకచకా ఒక దిశలో పరుగులు పెడుతూ వాసన చూడడం.. ఒక లగేజీ దగ్గర ఆగిపోవడం.. అందులో గంజాయి దొరకడం.. పోలీసులు లగేజీతోపాటు వాటిని తెచ్చిన వారిని శ్రీకృష్ణ జన్మస్థలానికి పంపించడం చకచకా జరిగిపోయాయి. ఈ రాణి ఒక నార్కోటిక్ డాగ్. అంటే మాదక ద్రవ్యాలను పసిగట్టేందుకు పోలీసులు ఉపయోగించే జాగిలం. ఐదు కిలోమీటర్ల అవతల ఉన్న మాదక ద్రవ్యాన్ని కూడా ఇట్టే పసిగట్టగలదు. - శ్రీకాకుళం క్రైమ్

సమ్‌థింగ్ స్పెషల్

జిల్లాలోని రైల్వేస్టేషన్లు, బస్ కాంప్లెక్సు, ట్రావెల్స్, కొరియర్ సర్వీస్ సెంటర్లు, చెక్‌పోస్టుల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. కేవలం పోలీసులే కాదు.. వారితో పాటు ఓ జాగిలం కూడా కనిపిస్తుంది. ఇదే నార్కోటిక్ డాగ్. మరో మాటలో చెప్పాలంటే కేనైన్ డాగ్. వాస్తవానికి ఇక్కడ తనిఖీ చేసేది ఈ జాగిలమే. అది జాడ తెలుసుకుంటే ఖాకీల మిగతా పని సులువైపోతుంది. శునకాలు వాసన పసిగడతాయని అందరికీ తెలుసు. కానీ కేవలం మాదక ద్రవ్యాల వాసన పసిగట్టడం అంత తేలికైన విషయం కాదు. తొమ్మిది నెలల పాటు దీనికోసం ఈ జాగిలాలకు కఠోర శిక్షణ ఇస్తారు.

వాసన చూసీ చూసీ..

నార్కోటిక్ డాగ్‌ల జీవిత కాలం 13 ఏళ్లు. కానీ వృత్తిపరంగా ఇవి మాదక ద్రవ్యాల వాసన చూసీ చూసీ వాటి ఆయుర్దాయం తగ్గిపోతుంది. పదేళ్లకే ఇవి మరణిస్తాయి. ట్రాకర్ డాగ్‌లైతే చోరుల వాసన కూడా సరిగడతాయి.

డాగ్‌స్క్వాడ్ ఇలా..

జిల్లాలో ప్రస్తుతం నాలుగు శునకాలు పోలీసులకు సాయం చేస్తున్నాయి. అందులో ట్రాకర్ డాగ్ ఒకటి, నార్కోటిక్ డాగ్ ఒకటి ఉంది. ఇలాంటివే మరో రెండు ఇంకా శిక్షణ దశలో ఉన్నాయి. వీటిలో నార్కోటిక్ డాగ్‌ను గంజాయి, నాటుసారా, నల్లమందు, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను ఎక్కడ ఉన్నా పసిగట్టేలా తొమ్మిది నెలల శిక్షణ ఇప్పించి ఇటీవలే తెచ్చారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్లు, బస్‌కాంప్లెక్సు, ట్రావెల్స్, కొరియర్ సర్వీస్ సెంటర్లు, చెక్‌పోస్టులలో తనిఖీలు చేయిస్తున్నారు. ఇటీవల ట్రక్కులు, బొలేరాలు, కంటైనర్లలో కూడా గంజాయి తరలిస్తుండటంతో వాటిపైనా దృష్టి పెట్టారు.



రాణి జాగిలంతో ద్విచక్ర వాహనదారుడి వద్ద లగేజీని తనిఖీ చేస్తున్న డ్వాగ్‌స్కాడ్

వాసన ఎలా పసిగడుతుంది..?

ఎంపిక చేసిన పోలీసు శునకాలకు మంగళగిరి సీటీసీలో తొమ్మిది నెలల శిక్షణ ఇస్తారు. అక్కడ ప్రతి రోజూ సాయంత్రం గంజాయి వాసన చూపిస్తారు. అదే గంజాయిను దూరంగా దాచి పెట్టి డాగ్‌ను వదులుతారు. గాలి వీస్తున్న దిశను బట్టి డాగ్ గంజాయి జాడ కనిపెట్టి చూపెడుతుంది. మూడు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం వరకు కనిపెట్టగలదు. దీనికి తోడుగా డాగ్ హ్యాండ్లర్, ఓ హెల్పర్ ఉంటారు.

మన రాణి దినచర్య ఇదే..

- జిల్లాలో ప్రస్తుతమున్న నార్కోటిక్ కేనైన్ డాగ్ పేరు రాణి.
- ఉదయం 5 గంటలకు కాలకృత్య, వ్యాయామాలతో దీని దినచర్య ప్రారంభమవుతుంది.
- ఎనిమిది గంటలకు రాయల్ కెనైన్ (మటన్, గోధుమపిండితో చేసిన) ఫుడ్ పెడతారు.
- మళ్లీ సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్యలో సేమ్‌ఫుడ్ ఉంటుంది.
- మధ్యలో పాలు (ఉదయం, రాత్రి), గుడ్లు ఇస్తారు.



నార్కోటిక్ కేనైన్ డాగ్ రాణి

- రోజుకు ఎనిమిది గంటలు నిద్రపోతుంది.

ఘనంగా సత్యసాయి జయంత్యుత్సవం



సత్యసాయి జయంత్యుత్సవాలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పెద్ద మందిరంలో ఇలా కేక్ కట్ చేసి వేడుక చేసుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఏడు ఇసుక లారీలు సీజ్

ఆమదాలవలస: మండలంలోని నాగావళి నదీ పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఏడు ఇసుక లారీలను సీజ్ చేసినట్లు ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ శనివారం తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి నాగావళి నది నుంచి అక్రమ తవ్వకాలు జరిపి లారీల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే రాత్రి రెండు గంటల సమయంలో కొత్త రోడ్డు సమీపంలో ఇసుక లారీలు ఆపి పత్రాలను పరిశీలించగా ఎలాటి అనుమతి పత్రాలు లేనందున లారీలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. సీజ్ చేసిన ఇసుక లారీలను జిల్లా గనుల శాఖ అధికారులకు అప్పగించామన్నారు.



సీజ్ చేసిన ఇసుక లారీలు

ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ప్రతిపాదిత ఓటర్ల జాబితాను శనివారం జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఈ నెల 6వ తేదీ వరకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొత్తం 17,404 మంది దరఖాస్తు చేశారు. ఆన్‌లైన్ ద్వారా 4,802 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 12,602 దరఖాస్తు చేశారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, మొత్తం 15,287 మందికి ఓటు హక్కు కల్పించారు. వీరిలో పురుషులు 9,638 మంది, స్త్రీలు 5,649 మంది ఉన్నారు. ఈ ముసాయిదాపై డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ప్రకటించిన ముసాయిదా జాబితాలో మార్పులు,చేర్పులకు వచ్చేనెల 9వ తేదీ వరకు www.coeandhra.nic.in అనే వెబ్‌సైట్‌లో కాని, సంబంధిత ఓటర్ల నమోదు అధికారికి గానీ, సహాయ ఓటరు నమోదు అధికారులు లేదా ప్రత్యేక అధికారులకు గాని దరఖాస్తులను సమర్పించవచ్చు. ప్రచురించిన ముసాయిదా జాబితాలో అర్హులైన వారి పేరు నమోదు కాకపోతే కనీసం మూడేళ్ల బోధన అనుభవం గల ధ్రువీకరణ పత్రంతో పాటు అన్ని డాక్యుమెంట్లతో ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యంతరాలను ఫారం-7 ద్వారా తెలియజేయాలి. ముసాయిదా జాబితాలో శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి పురుషులు 2725 మంది మహిళలు 1181 మంది ఉన్నారు.

క్లుప్తంగా

వసతులు లేనిచోట పరీక్ష కేంద్రమా?

ఆమదాలవలస: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల 3వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి షెడ్యూల్‌ను యూనివర్సిటీ విడుదల చేసింది. అయితే ఆమదాలవలస అర్బన్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా అనుమతులు తెచ్చుకున్న ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలకు కూడా ఎగ్జామినేషన్ సెంటర్‌గా కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత కళాశాలకు మూడేళ్లుగా యూనివర్సిటీ, ఉన్నత విద్య అనుమతులు రద్దు చేశారు. కాలేజీ ప్రారంభమై 20 ఏళ్లు గడిచినా సొసైటీ తరఫున సొంత భూమి, భవనం, మరుగుదొడ్లు, ప్రయోగశాలలు, పార్కింగ్ స్థలం వంటివి లేకపోవడం, ప్రస్తుత అద్దె భవనానికి ఒప్పంద పత్రం, తరగతి గదులు, ఫైర్ సేఫ్టీ, ఆట స్థలం, గ్రంథాలయం వంటివి లేకపోవడంతో అనుమతులు రద్దు చేసినట్లు అప్పట్లో అధికారులు వెల్లడించారు. అయితే ఈ విద్యా సంవత్సరంలో మళ్లీ అదే యూనివర్సిటీ అధికారులు అనుమతులు మంజూరు చేయడం, వివిధ రకాలైన షాపింగ్ కాంప్లెక్స్‌ల మధ్య చిన్న గృహ నిర్మాణ సముదాయంలో జూనియర్ కళాశాల అని బోర్డు పెట్టి డిగ్రీ కళాశాల నడపడంపై పలువురు తప్పుపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌తోపాటు పలువురు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి వసతులు లేని కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించడం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత


వాహనంలో ఉన్న పశువులు

ఆమదాలవలస: ఆమదాలవలస నుంచి పాలకొండ వైపు పశువులను అక్రమంగా తరలిస్తున్న వారిపై శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ–2 ఎ.సింహాచలం తెలిపారు. పురపాలక సంఘంలోని ఏడో వార్డు, శ్రీకాకుళం రూరల్ మండలానికి చెందిన చింతాడ వారపు సంత నుంచి వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తుండగా వంతెనపై పట్టుకున్నామని, కబేళాకు తరలిస్తున్నట్లు గుర్తిం వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. చింతాడ గ్రామానికి చెందిన బోర వెంకట సూర్యనారాయణ, బూర్జ మండలం ఏబీసీ పేట(కోణం పేట)కు చెందిన గురుగుబెల్లి రాములపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


నరసన్నపేట: జాతీయ రహదారిపై తిలారు నుంచి అక్రమంగా వాహనంలో దూడలను తరలిస్తుండగా మడపాం టోల్‌గేట్ వద్ద నరసన్నపేట పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దూడలను కొత్తవలస గోశాలకు తరలించినట్లు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి డ్రైవరును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

పోలీసులకు చిక్కిన చోరీ నిందితుడు


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంజిత్

పోలాకి: మండలకేంద్రం పోలాకిలోని సత్యసాయి మందిరంలో ఈ నెల 20న వెండి వస్తువుల చోరీకి పాల్పడిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు నరసన్నపేట సీఐ జెర్రిపోతుల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పోలాకి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రంజిత్‌తో కలిసి కేసు వివరాలు విలేకర్లకు వెల్లడించారు. సారవకోట మండలం మదనాపురం గ్రామానికి చెందిన పాలమహంతి ప్రసాదరావు అనే వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్లు తెలిపారు. నిందితుడిని ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడిలో అదుపులోకి తీసుకుని సుమారు 480 గ్రాముల వెండివస్తువులు రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు చెప్పారు. కేసును ఛేదించిన ఎస్ఐ రంజిత్, ఏఎస్ఐ ఆదినారాయణ, కానిస్టేబుల్ శంకర్‌లను సీఐ అభినందించారు. మండలంలో ఇటీవల జరిగిన ఘటనలపైనా ప్రత్యేక దృష్టి సారించామని, బెలమరలో చైన్ స్నాచింగ్‌పై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వలస కార్మికుడు మృతి


అందాల యోగేశ్వరరావు (ఫైల్)

సోంపేట: మండలంలోని బెంకిలి గ్రామానికి చెందిన అందాల యోగేశ్వరరావు (58) అనకాపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈయన కర్రల మిల్లులో వలస కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులు నిర్వహించుకుని తిరిగి వస్తుండగా కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందాడు. శనివారం అనకాపల్లిలో శవ పంచనామా నిర్వహించి బెంకిలి గ్రామానికి మృతదేహం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. యోగేశ్వరరావుకు భార్య అందాల లక్ష్మి, కుమారులు తేజేశ్వరరావు, దుర్యోధన ఉన్నారు. దుర్యోధన ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాడు.

ఇసుక అక్రమాలను అరికట్టాల్సిందే


మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయ. చిత్రంలో కలెక్టర్, అధికారులు

- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ విజయ
- ఇసుక అక్రమాలపై గొంతెత్తిన సభ్యులు
- విద్యాభివృద్ధిపై చర్చలో జెడ్పీటీసీల వాగ్వాదం

అరసవల్లి: ఉచిత ఇసుక పేరిట జరుగుతున్న అక్రమాలను అధికారులు అరికట్టాల్సిందేనని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ స్పష్టం చేశారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇసుక అక్రమాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని చెప్పారు. జిల్లాలో అనధికార రీచ్‌లతో పాటు ఒడిశా బిల్లులతో ఇసుకను భారీ వాహనాలతో తరలిస్తున్నా చర్యలు చేపట్టకపోవడంపై మండిపడ్డారు. పింఛన్ల తొలిగింపు ప్రారంభించారని.. అర్హతలను గమనించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు పలు శాఖల ప్రగతిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్, జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజాల సమక్షంలో సమీక్షించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపడుతున్న గ్రామాభివృద్ధి పనుల్లో వెండర్ విధానాన్ని అమలు చేయడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో వెండర్ ద్వారా మెటీరియల్స్ మాత్రమే తెప్పించుకునేవారని, ఇప్పుడు పనుల కాంట్రాక్టు కూడా వెండర్ల ద్వారానే చేపట్టడం దారుణమన్నారు. తీర్మానాలు చేసిన సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీ సభ్యులకు ఏం గౌరవముంటుందని జెడ్పీటీసీలు సిరిపురపు జగన్మోహనరావు, టొంపల సీతారాం, బెజ్జిపురపు రామారావు, కాయల వెంకటరావులు ప్రశ్నించారు. అందరికీ ఆమోద యోగ్యంగా పనులను కేటాయించాలని చైర్‌పర్సన్ విజయ అధికారులకు సూచించారు.

బాస్ ఎవరో చెప్పాలి


ధర్మాన కృష్ణచైతన్య

పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ గోపాలపెంట రీచ్‌లో ఇసుక అక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. గ్రామాల వీధుల మీదుగా వందలాది లారీలు వెళ్తున్నాయని, ఎవరైనా ఆపితే...'మా బాస్ తాలూకా..' అంటున్నారని..ఎవరా బాస్ అని ప్రశ్నించారు. ప్రతి లారీ నుంచి మామూలును ఏ బాస్‌కు పంపిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల శాసనసభలో నరసన్నపేట ఆస్పత్రిని అధ్వానంగా మార్చారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చెప్పారని, అసలు వాస్తవాలను వైద్యశాఖాధికారులు జెడ్పీ సభలో వివరించాలని కోరారు. దీంతో డీసీహెచ్ఎస్ కళ్యాణ్‌బాబు మాట్లాడుతూ...2020లో నరసన్నపేట ఆసుపత్రి 50 నుంచి 100 బెడ్ల ఆసుపత్రిగా మారిందని అంగీకరించారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా


జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జగన్‌మోహనరావు

జిల్లాలో ఇసుక అక్రమాలపై సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుక పాలసీ అమల్లో భాగంగా యూనిట్ ధర రూ.200 వసూళ్లు చేస్తుందని, ప్రజలకు మాత్రం ట్రాక్టర్ (మూడు టన్నులు) రూ.4 వేలు నుంచి రూ.5 వేలకు అమ్ముతున్నారని చెప్పారు. నిబంధనల ప్రకారం సాయంత్రం ఆరు తర్వాత రీచ్‌ల నుంచి ఇసుక తరలించకూడదని, అయితే అర్ధరాత్రి దాటుతున్నా రవాణా ఆగడం లేదన్నారు. అక్రమాలు బయటపడతాయని చాలా రీచ్‌లలో సీసీ కెమెరాలు తొలగించారని చెప్పారు. పైడిభీమవరంలో ఉన్న చెక్‌పోస్టు వద్ద ఒకరోజు మనమంతా కాపలా కాస్తే ఇసుక అక్రమాలు, ఒడిశా బిల్లులతో లారీల సంగతి తేలిపోతుందని అధికారులకు సవాల్ విసిరారు.

నాడు-నేడుపై వాగ్వాదం


రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాంతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ జెడ్పీటీసీ బుచ్చిబాబు

రాష్ట్రంలో గత ఐదేళ్లలో విద్య, వైద్యశాఖ అభివృద్ధి అప్పటి సీఎం జగన్ పుణ్యమే చైర్‌పర్సన్ విజయ పునరుద్ఘాటించారు. దీనిపై హిరమండలం జెడ్పీటీసీ బుచ్చిబాబు మాట్లాడుతూ నాడు–నేడు పేరిట అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాం కల్పించుకుంటూ విద్యాభివృద్ధి జగన్ వల్లనే సాధ్యమైందని, ఇంగ్లీష్ మీడియం చదువులు వద్దంటూ..చంద్రబాబే అడ్డుకుని కుట్రలు పన్నారని గుర్తుచేశారు. దీంతో బుచ్చిబాబు ఆగ్రహంతో ఊగిపోతూ అక్రమాలు చేసింది జగనే అంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. గార ఎంపీపీ గొండు రఘురాం జోక్యం చేసుకుంటూ లేనిపోని ఆరోపణలు చేయడం తగదని, అవసరమైతే విచారణ చేసి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ సభ్యులు హుందాగా వ్యవహరించాలని, ప్రజా సమస్యలపై అర్థవంతంగా చర్చలు సాగాలన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో అధికారులు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులా?

- దేశంలో ఎక్కడా లేనివిధంగా కూటమి ప్రభుత్వ విధానాలు
- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ధ్వజం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

శ్రీకాకుళం: దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ధ్వజమెత్తారు. జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు అతిథి గృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఏసీ పదవి ప్రతిపక్ష సభ్యులకు ఇవ్వటం ఆనవాయితీగా వస్తోందని, చంద్రబాబు ప్రభుత్వం అందుకు భిన్నంగా కూటమిలో భాగస్వామ్యమైన జనసేన నాయకులకు ఇవ్వటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఇప్పుడు శాశ్వత బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఐదు నెలల తర్వాత మరోసారి శాశ్వత బడ్జెట్ ప్రవేశపెడతారని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇప్పటి వరకు ఇలా జరగలేదన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు రూ.14లక్షల కోట్లు అని టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. బడ్జెట్‌లో సూపర్ సిక్స్ పథకాలకు కేటాయింపులు లేకపోవడం ప్రజలకు మోసం చేసినట్లే అవుతుందన్నారు. గతంలో పార్లమెంట్‌లో ఇద్దరు సభ్యులే ఉన్న పార్టీకి ప్రతిపక్ష హోదా కల్పించారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభుత్వ విధానాలు ప్రశ్నిస్తే తప్పుడు కేసులు కేసులు నమోదు చేయిస్తున్నారని, తనపైనా అలాగే కేసు పెట్టారని మండిపడ్డారు. తాను పవన్ కళ్యాణ్‌కు చెప్పు చూపించినందున కేసు నమోదు చేశారని.. ఓ బహిరంగ సభలో జగన్‌మోహన్ రెడ్డి, ఆయన మంత్రులను ప్రస్తావిస్తూ పవన్ కల్యాణ్ కూడా చెప్పు చూపించారని గుర్తు చేశారు. ప్రతి సభలోనూ వైసీపీ నా కొడుకుల్లారా అంటూ పవన్ కల్యాణ్ సంబోధించటం బూతు మాట కాదా అని ప్రశ్నించారు. విశాఖతో పాటు దేశంలో ఉన్న 80 శాతం పోర్టులు 2,500 ఎకరాల లోపలే ఉన్నాయని, మూలపేటలో 1250 ఎకరాల్లో పోర్టుల నిర్మాణ పనులు చేపట్టామని, 75 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన పనులు ఎప్పుడు పూర్తవుతాయో పాలకులు చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో కళింగపట్నంలో ఎయిర్ పోర్ట్ పెట్టాలని యోచించామని, ప్రస్తుత మంత్రి జిల్లాకు ఎయిర్ పోర్టు అని చెబుతూ టెక్కలిని ఎంపిక చేసినట్లు చెప్పారని, తాజాగా టెక్కలిని కాదని పలాసకు ఎందుకు మళ్లించారో చెప్పాలన్నారు. దోపిడీ కోసమే ఎయిర్ పోర్టుకు 15వేల ఎకరాలు సేకరిస్తున్నారని ఆరోపించారు. తాను కేసులకు భయపడనని స్పష్టం చేశారు.

పేదల ఇళ్లు బుగ్గిపాలు

- సంతవురిటిలో అగ్ని ప్రమాదం
- తొమ్మిది ఇళ్లు దగ్ధం.. రూ.12 లక్షల ఆస్తి నష్టం
- కట్టుబట్టలతో మిగిలిన బాధితులు


సంతవురిటిలో కాలిపోతున్న ఇళ్లు

జి.సిగడాం: మండలంలోని సంతవురిటిలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో తొమ్మిది ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.12 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఇద్దరు వృద్ధులు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయాన్నే పిల్లలు బడికి, పెద్దలు వివిధ పనులకు వెళ్లిపోయారు. కొంతమంది గ్రామ సమీపంలోనే పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో గ్రామం నుంచి భారీగా పొగలు రావడాన్ని గుర్తించి వెంటనే ఊర్లోకి పరుగెత్తారు. అప్పటికే తలె సంతోష్‌కుమారి, లండ లక్ష్మణ, కోడిగుడ్లు ఆదెమ్మ, కేతుబారిక సోములు, కేతుబారిక అసిరయ్య, కేతుబారిక దాలెమ్మ , కేతుబారిక శంకరరావు, కరజాడ ఈశ్వరరావు, కేతుబారిక శంకరరావు(దాలెప్పుడు)ల ఇళ్లు కాలిపోవడం చూసి ఆందోళనకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు, ఎస్ఐ మధుసూదనరావు, రాజాం, పొందూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇళ్లన్నీ కాలిపోయాయి. ఏ ఇంట్లో తొలుత మంటలు చెలరేగాయో ఇంకా తెలియలేదు.

బాధితులకు సాయం..

అగ్ని ప్రమాదం జరిగి వెంటనే విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు శిర్రా లక్ష్మి, దూవులారి రమణ, చందనాల రంగారావు ఘటనా స్థలానికి చేరుకుని ఒక్కొక్కరికీ 10 కేజీల బియ్యం అందించారు. పక్కా గృహాల నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మృత్యుంజయులు


ప్రమాదం నుంచి బయటపడిన వృద్ధులు

అగ్ని ప్రమాదం నుంచి కోడిగుడ్లు ఆదెమ్మ, కేతుబారిక దాలెమ్మలు త్రుటిలో తప్పించుకున్నారు. వీరిలో ఒకరు కాళ్లు, చేతులు పనిచేయవు. మరొకరికి కళ్లు సరిగ్గా పనిచేయవు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆందోళనకు గురవుతున్న సమయంలో సమీపంలో ఉన్న యువకులు గుర్తించి కాపాడారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

పొట్లాల్లో గంజాయి విక్రయం

- గూనపాలెంలో నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- రెండు కిలోలకు పైగా గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న గూనపాలెంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 2 కిలోల 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఒకటో పట్టణ సర్కిల్ కార్యాలయంలో శనివారం డీఎస్పీ సీహెచ్ వివేకానంద విలేకరులకు వివరాలు వెల్లడించారు.

చిన్న చిన్న పొట్లాలుగా..

గూనపాలెం చెరువుగట్టువీధికి చెందిన లండ కుమార్ వంట పని చేస్తుంటాడు. ఆదాయం సరిపోకపోవడం వ్యసనాలకు బానిసయ్యాడు. ఏదో రకంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో ఉండేవాడు. దీనికి సులువైన మార్గంగా ఒడిశాలోని పర్లాకిమిడి నుంచి జిల్లా కేంద్రానికి గంజాయిని తేవడం.. చిన్న చిన్న పొట్లాలుగా మార్చి అధిక సొమ్ముకు యువకులకు, మైనర్లకు విక్రయించడం పనిగా పెట్టుకున్నాడు.

ఎలా పట్టుబడ్డాడంటే..

ఈ నెల 22న మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో 80 ఫీట్ రోడ్డు సమీప మైదానంలో అనుమానంగా తిరుగుతున్న కుమార్‌ను ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ, సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా రెండు కిలోలకు పైగా గంజాయి ఉండటంతో స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. చిన్న చిన్న పొట్లాలు చేసి అమ్ముతున్నట్లు చెప్పడంతో ఎవరెవరికి విక్రయిస్తున్నాడో వివరాలు తీసుకున్నారు. ఆ సమాచారం మేరకు కొందరిని గుర్తించారు. వారి తల్లిదండ్రుల ద్వారా డీఎడిక్షన్ సెంటర్లకు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

మూలాలన్నీ ఒడిశాలోనే..

గంజాయి మూలాలన్నీ ఒడిశాలోనే ఉన్నాయని డీఎస్పీ వివేకానంద తెలిపారు. నిందితుడు కుమార్ ఇచ్చిన సమాచారంతో కొందరిని (ఒడిశా, నగర వాసులు) గుర్తించామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి మిగిలిన వారినీ త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి సైతం గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరిస్తున్నారని, ప్రత్యేక బృందాలతో డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే డ్రోన్ కెమెరాలతో స్పాట్స్ గుర్తిస్తున్నామని, గంజాయి ఎక్కడ ఉన్నా పసిగట్టేలా కెనైన్ డాగ్‌తో ఆనవాళ్లు గుర్తిస్తున్నామని చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషిచేసిన సీఐ సీహెచ్ పైడపునాయుడు, ఎస్ఐ ఎం.హరికృష్ణ , ఏఎస్ఐ బి.రమేష్‌బాబు, పీసీలు రవికుమార్, దుర్గారావు, రమణమూర్తి, జగదీష్‌లను డీఎస్పీ అభినందించారు.

గంజాయి రవాణా గుట్టురట్టు

- ఒడిశాకు చెందిన ఐదుగురు అరెస్టు
- గ్రానైట్ కంపెనీ కార్మికులకు, విద్యార్థులకు అమ్ముతున్నట్లు గుర్తించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి జంక్షన్‌లో జాతీయ రహదారిపై 10 కేజీల గంజాయి కలిగి ఉన్న ఒడిశాకు చెందిన ఐదుగురిని కోటబొమ్మాళి పోలీసులు శనివారం అరెస్టుచేశారు. పట్టుబడిన వారిలో ఒక మహిళ కూడా ఉన్నారు. జిల్లా అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. శనివారం ఉదయం పదిన్నర గంటల సమయంలో ఒడిశాకు చెందిన సూరత్ జనా, జెనా సుశ్మిత, విజయ్‌సింగ్, అర్జున్‌సింగ్, ఆశిష్ జెనా అనే ఐదుగురు వ్యక్తులు జర్జంగి జంక్షన్‌లో తెల్లని సంచులు పట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతుండగా కోటబొమ్మాళి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 10 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఇద్దరు ముద్దాయిలు కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడి, చిన్నబమ్మిడి గ్రామాల్లో నివాసముంటున్నారు. ఒడిశాకు చెందిన ప్రదీప్ ఆధ్వర్యంలో ఈ ముఠా గంజాయి తెచ్చి కోటబొమ్మాళి, నరసన్నపేట మండలాల్లోని గ్రానెట్ పాలీషింగ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కొందరు కార్మికులకు, కాలేజీ విద్యార్థులకు విక్రయిస్తున్నారు. ఈ ఐదుగురినీ అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. గంజాయికి బానిసైన విద్యార్థులకు విశాఖపట్నంలో ప్రత్యేక కౌన్సిలింగ్ ఇస్తామని చెప్పారు. గంజాయి విక్రయాలకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాస్, కోటబొమ్మాళి ఎస్ఐ వి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పొదల్లోకి దూసుకెళ్లిన బైక్

- యువకుడు దుర్మరణం
- మూడు రోజుల తర్వాత వెలుగులోకి..


సోమేశ్వరరావు(ఫైల్)


ఘటనా స్థలంలో మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని దుర్భలాపురం గ్రామానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పాతపట్నం సీఐ రామారావు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. సిరియాఖండి పంచాయతీ దుర్భలాపురం గ్రామానికి చెందిన కోటిలింగాల సోమేశ్వరరావు (32) పలాసలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ.. రోజూ బైక్‌పై వెళ్లి వస్తుండేవాడు. ఈ నెల 20న రాత్రి తన తల్లికి ఫోన్ చేసి ఇంటికి రావడం ఆలస్యమవుతుందని తెలియజేశాడు. ఉదయానికి కూడా ఇంటికి రాకపోవడంతో ఫోన్లు చేసినా స్పందించలేదు. రెండు రోజుల పాటు కుటుంబసభ్యులు వెతగ్గా ఫలితం లేకపోవడంతో ఈ నెల 22న మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌లో మృతుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పర్లాఖిమిడి–పలాస రహదారిలో జాడుపల్లి జోడూరు గ్రామాల మధ్య మలుపు పొదల్లో మృతదేహాన్ని కొంతమంది రైతులు గుర్తించారు. పోలీసులు వెళ్లి పరిశీలించగా.. మిస్సింగ్ కేసు నమోదుచేసిన వ్యక్తేనని గుర్తుపట్టారు. 20వ తేదీ అర్ధరాత్రి సమయంలో పలాస నుంచి ఇంటికి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి పొదల్లోకి దూసుకుపోవడంతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు చెబుతున్నారు. మృతుడి సోదరుడు గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రమేష్‌బాబు కేసునమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎయిర్‌పోర్టు పేరిట ఏకపక్ష నిర్ణయాలు తగదు


సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

వజ్రపుకొత్తూరు రూరల్/వజ్రపుకొత్తూరు/పలాస/కాశీబుగ్గ: అభివృద్ధి పేరిట పచ్చని ఉద్దాన ప్రాంతాన్ని నాశనం చేసి ప్రజల బతుకులను రోడ్డు పాలు చేసేలా ప్రభుత్వం ఒంటెద్దు పోకడ నిర్ణయాలు తీసుకోవడం సరికాదని వైఎస్సార్ సీపీ నాయకుడు, వజ్రపుకొత్తూరు మండల ప్రత్యేకాహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మందస, వజ్రపుకొత్తూరు మండలాల సరిహద్దు గ్రామాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం కేంద్ర బృందం (ఏఏఐ) స్థలాన్ని పరిశీలించిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం బాధిత గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని.. ప్రజా ఆమోదంతోనే జరగాలన్నది తమ అభిమతమని స్పష్టం చేశారు. కొన్నిచోట్ల విశాలమైన ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని వదిలి ఉద్యాన రైతులకు సంబంధించిన జిరాయితీ భూములను లాక్కొనే ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయమై పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు తిర్రి గుణ, రాజారావు, తిర్రి కామేశ్వరి, లక్ష్మీనారాయణ, జోగి అప్పారావు, ఆర్.భీమారావు, డి.పాపారావు, కె.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

- ప్రజా ఆమోదం లేకుండా ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేసే ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని చేపట్టం సరికాదని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర ప్రకాష్, గొరకల బాలక్రిష్ణ, ఆర్.మాధవరావు, అరుణోదయ నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, పీఓడబ్ల్యూ నాయకురాలు ఎస్.కృష్ణవేణి, పోతపల్లి కుసుమ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాందోళన లేవకముందే ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వివిధ సంఘాల ప్రతినిధులు కుత్తుమ హేమక్క, సార జగన్, బర్ల గోపి, పి.మల్లేశ్వరరావు పేర్కొన్నారు.